సాక్షి పశ్చిమగోదావరి

మంగళవారం । 5 । నవంబర్ । 2024



విలీన మండలాల్లో అయోమయం

పోలవరం ప్రాజెక్ట్ ఎత్తు 41.15 కాంటూర్‌కు మాత్రమే పరిమితం అంటూ వస్తున్న వార్తలు విలీనమండలాల ప్రజలను అయోమయానికి గురిచేస్తున్నాయి. 8లో ▸



చేతబడి కేసులో ఆరుగురి అరెస్ట్

కైకలూరు మండలం చటకాయలో చేతబడి నెపంతో ముగ్గురిపై పాశవిక దాడి చేసిన నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. 8లో ▸



మిన్నంటిన రోదనలు

ఉండ్రాజవరం మండలం తాడిపర్రులో విద్యుత్ షాక్ ఘటనలో మృతి చెందిన వారి బంధువుల రోదనలు తణుకు ప్రభుత్వాసుపత్రి వద్ద మిన్నంటాయి. 8లో ▸

న్యూస్‌రీల్

చలో విజయవాడ విజయవంతం చేయాలి



మెడికల్ రిప్స్ చలో విజయవాడ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

భీమవరం: మెడికల్ రిప్రజెంటేటివ్స్ సమస్యలు పరిష్కరించాలంటూ ఈ నెల 7న చలో విజయవాడ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మెడికల్ రిప్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.శిరీష్ కుమార్ చెప్పారు. సోమవారం భీమవరంలో విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. సేల్స్ ప్రమోషన్ ఎంప్లాయిస్ చట్టం అమలుచేయాలని, సేల్స్ ఒత్తిడితో ఇటీవల మెడికల్ రిప్స్ మరణిస్తున్నారని ఒత్తిడి తెచ్చే ఫార్మా కంపెనీల యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వేజ్ బోర్డును ఏర్పాటుచేసి మెడికల్ రిప్స్‌కు నెలకు కనీసం రూ.26 వేల జీతం ఇవ్వాలని హైలీ స్కిల్డ్ కేటగిరిలో గుర్తించాలన్నారు. రాష్ట్ర కార్యవర్గసభ్యుడు ఎస్.శ్రీనివాస్ మాట్లాడుతూ చలో విజయవాడ ధర్నాకు మెడికల్ రిప్స్ పెద్ద సంఖ్యలో హాజరు కావాలని పిలుపు నిచ్చారు. చలో విజయవాడ ధర్నా పోస్టర్‌ను ఆవిష్కరించారు.

అర్జీలు సకాలంలో పరిష్కరించాలి



మీకోసంలో అర్జీలు స్వీకరించి మాట్లాడుతున్న కలెక్టర్ నాగరాణి

భీమవరం(ప్రకాశం చౌక్): ప్రజల నుంచి అందే అర్జీలకు ప్రాధాన్యత ఇచ్చి సకాలంలో పరిష్కరించాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో మీకోసం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో కలెక్టర్ నాగరాణి పాల్గొని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అర్జీల పరిష్కారంలో నాణ్యత ప్రమాణాలు విధిగా పాటించాలన్నారు. అర్జీదారునికి అర్థమయ్యే రీతిలో సమాధానాన్ని రిజిస్టర్ పోస్ట్ ద్వారా గాని, వాట్సప్ ద్వారా గాని పంపించాలన్నారు.

సమస్యల పట్ల సానుకూలంగా స్పందించాలి



భీమవరంలో ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఏఎస్పీ భీమారావు

భీమవరం: అర్జీదారుల సమస్యల పట్ల సానుకూలంగా స్పందించి, చట్ట పరిధిలో చర్యలు చేపట్టాలని పోలీసు అధికారులను జిల్లా అదనపు ఎస్పీ వి.భీమారావు ఆదేశించారు. జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పబ్లిక్ గ్రీవెన్స్ కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారుల నుంచి సమస్యలు తెలుసుకున్నారు. సంబంధిత పోలీసు అధికారులతో మాట్లాడి ఫిర్యాదులను చట్టపరిధిలో విచారించి త్వరితగతిన పరిష్కరించాలన్నారు.

ఉపాధ్యాయులు ఓటర్లుగా నమోదు చేసుకోవాలి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఉభయగోదావరి జిల్లాల ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో మూడు జిల్లాల పరిధిలో ఉన్న ఉపాధ్యాయులు, అధ్యాపకులు, ఆచార్యులు, పట్టభద్రులు, ఏపీటీఎఫ్ కార్యకర్తలు ఓటర్లుగా నమోదు చేసుకోవాలని ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ ఏలూరు జిల్లా శాఖ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు తాళ్లూరి రామారావు, బీ.రెడ్డి దొర ఒక ప్రకటనలో కోరారు. ఈ నెల 6 నమోదుకు ఆఖరి రోజని .. తప్పక ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు.

హేలాపురి బాలోత్సవ సావనీర్ ఆవిష్కరణ

ఏలూరు(మెట్రో): హేలాపురి బాలోత్సవ పిల్లల సంబరాల సావనీర్‌ను కలెక్టర్ కె.వెట్రిసెల్వి ఆవిష్కరించారు. సోమవారం కలెక్టరేట్‌లో నాలుగో పిల్లల సంబరాల జ్ఞాపకాల సంచికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గుడిపాటి నరసింహారావు మాట్లాడుతూ సృజనాత్మకతను పెంచే వేదికను అందించడానికి ప్రయత్నం చేస్తున్నామని తెలిపారు.

శివోహం

కార్తీక మాసం మొదటి సోమవారం శివాలయాలు శివనామస్మరణతో మార్మోగాయి. భీమవరం పంచారామక్షేత్రంలో ఉమాసోమేశ్వరస్వామికి విశేష పూజలు నిర్వహించారు. పాలకొల్లు క్షీరారామ లింగేశ్వర స్వామి ఆలయంలో మహన్యాసపూర్వక రుద్రాభిషేకాలు, పంచామృతాభిషేకాలు నిర్వహించారు. క్షీరారామలింగేశ్వరస్వామిని 30 వేల మంది వరకూ దర్శించుకున్నట్లు అంచనా వేశారు. - సాక్షి నెట్‌వర్క్



పాలకొల్లు సెంట్రల్ : క్షీరారామలింగేశ్వరుడికి అభిషేకం చేస్తున్న అర్చకస్వాములు



నరసాపురం : భక్తులతో కిటకిటలాడిన వశిష్ట గోదావరి వలంధర్ రేవు



పాలకొల్లు సెంట్రల్ : క్షీరారామలింగేశ్వర స్వామి ఆలయంలో వేకువజాము నుంచి క్యూలైన్‌లో వేచిఉన్న భక్తులు



భీమవరం(ప్రకాశం చౌక్): ఉమా సోమేశ్వర స్వామికి అభిషేకం చేస్తున్న అర్చకస్వాములు

కొత్త పింఛన్లకు చంద్రగ్రహణం

- పెండింగ్‌లో 20 వేలకు పైగా దరఖాస్తులు
- దరఖాస్తులు అప్‌లోడ్ కాకుండా ఆన్‌లైన్ సైట్ క్లోజ్
- ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు 50 ఏళ్లకే పింఛన్ హామీ గాలికి
- ఆయా సామాజిక వర్గాలకు చెందిన దాదాపు 2.5 లక్షల మంది ఎదురుచూపు
- అర్హత ఉన్నా పింఛన్ రాక నష్టపోతున్న పేదలు



సాక్షి, భీమవరం: కొత్త పింఛన్లు ఎప్పుడు మంజూరవుతాయో తెలీదు. 50 ఏళ్లు నిండిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు వృద్ధాప్య పింఛన్ హామీ ఊసే లేదు. వేల మంది అర్హులు పింఛన్ సాయం అందక నష్టపోతున్నా ప్రభుత్వానికి పట్టింపు ఉండదు. కొత్తవి ఇవ్వకపోయినా పాత వారికే పింఛన్ సొమ్ముల పంపిణీలో ప్రతీనెల కూటమి నేతలు చేస్తున్న హడావుడి మాత్రం అంతాఇంతా కాదు.

గత ప్రభుత్వంలో ఏటా జనవరి, జూలై నెలల్లో అర్హులైన వారికి కొత్త పింఛన్లు మంజూరు చేసేవారు. గ్రామ, వార్డు సచివాలయాల్లో దరఖాస్తు చేసుకుంటే చాలు సిబ్బంది వాటిని ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసేవారు. రాజకీయాలు, కులమత వర్గాలకు అతీతంగా, పేదరికమే ప్రామాణికంగా లబ్ధిదారుల ఎంపిక జరిగేది. ఈ ఏడాది జనవరిలో జిల్లాలో 4,274 కొత్త పింఛన్లు మంజూరు చేశారు. కొత్త పింఛన్ కోరుతూ జూన్ నాటికి దాదాపు 6,350 దరఖాస్తులు ఆన్‌లైన్ కాగా జూలైలో కొత్తవి మంజూరు కావాల్సి ఉంది. కూటమి ప్రభుత్వం వచ్చాక ఆ సైట్‌ను క్లోజ్ చేయడంతో ఇవి మరుగునపడిపోయాయి. దరఖాస్తుల ఆన్‌లైన్ ప్రక్రియ నిలిచిపోయింది. మండల, జిల్లా స్థాయిలో నిర్వహిస్తున్న మీకోసం కార్యక్రమంలో పింఛన్ సాయం కోసం పేదలు దరఖాస్తు చేసుకుంటున్నారు. వివిధ సామాజిక పింఛన్ల కోసం గత ఐదు నెలల్లో జిల్లా వ్యాప్తంగా 15 వేల వరకు దరఖాస్తులు వచ్చాయి. వీరంతా సచివాలయాలు, ఎంపీడీఓ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తుండగా ప్రభుత్వం నుంచి తమకు ఇంకా మార్గదర్శకాలు రాలేదని ఉద్యోగులు వారిని వెనక్కి పంపిస్తున్నారు. సైట్ ఓపెన్ కాక దరఖాస్తులను ఆన్‌లైన్ చేసే వీలులేకపోవడంతో ఎన్నో వ్యయ ప్రయాసలకోర్చి పేదలు అందజేస్తున్న ఆ అర్జీలు ఏమవుతున్నాయో తెలీని పరిస్థితి. తమకు అర్హత ఉన్నా ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల పింఛన్ సాయం అందక నష్టపోతున్నామని పేద వర్గాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొత్తవి ఇవ్వకపోగా ఉన్నవాటికి కోత పెడుతున్నారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కూటమి ప్రభుత్వం వచ్చే నాటికి జిల్లాలో పింఛన్ లబ్ధిదారులు 2,34,161 మంది ఉండగా నవంబరు నాటికి 2,29,184కు తగ్గారు.

హామీల అమలు ఎప్పుడు ?

50 ఏళ్లు నిండిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు వృద్ధాప్య పింఛన్ అందజేస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారు. ప్రతీ ఎన్నికల సభలోను కూటమి నేతలు ఈ అంశాన్ని విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లారు. జిల్లాలో 50 నుంచి 60 ఏళ్ల లోపు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు రెండున్నర లక్షల మంది వరకు ఉండగా వారిలో 80 శాతం మంది అర్హులు ఉంటారని అంచనా. కూటమి కూటమి ప్రభుత్వం ఏర్పడి ఐదు నెలలు కాగా ఎన్నికల హామీ అమలు కోసం ఆయా వర్గాల వారు ఎంతో ఆశగా ఎదురుచూస్తున్నారు. కాగా ప్రభుత్వం ఆ ఊసే ఎత్తకపోవడం వారిని తీవ్ర నిరాశకు గురిచేస్తోంది.

కూటమి నేతల అత్యుత్సాహం

కొత్త పథకాలు ప్రవేశపెట్టే సమయంలో ప్రజాప్రతినిధులు, అధికార పక్షం నాయకులు హాజరై వాటిని లాంఛనంగా ప్రారంభించడం పరిపాటి. తర్వాతి నుంచి యథాప్రకారం ఆ కార్యక్రమం అమలవుతుంది. కూటమి తీరు ఇందుకు భిన్నంగా ఉంది. సూపర్ సిక్స్ హామీల అమలులో తమ వైఫల్యాన్ని కప్పిపుచ్చుకునేందుకు ప్రతీనెల పింఛన్ల పంపిణీలో ఆర్భాటం చేస్తున్నారు. సచివాలయ సిబ్బందితో వెంట కూటమి నేతలు లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్ సాయం అందిస్తూ చేస్తున్న హడావిడి చూసి జనం ముక్కున వేలేసుకుంటున్నారు.

కొత్త పింఛన్లు లేవు



పేద వర్గాలకు ప్రభుత్వం ఇచ్చే సామాజిక పింఛనే జీవనాధారం. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఐదు నెలలు గడిచిపోయినా ఇప్పటికి కొత్త పింఛన్ మంజూరు చేయలేదు. కొత్త పింఛన్ల మంజూరుకు చర్యలు తీసుకోవాలి.

– బి.సూర్యనారాయణ, గవరపేట, పాలకొల్లు మండలం

హామీ అమలుచేయాలి



50 ఏళ్లకే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు వృద్ధాప్య పింఛన్లు అందజేస్తామని ఎన్నికల ముందు చంద్రబాబు చెప్పారు. ఇప్పుడు నా వయస్సు 52 ఏళ్లు. పింఛన్ కోసం అధికారులను అడుగుతుంటే ప్రభుత్వం నుంచి ఇంకా ఏమీ రాలేదని చెబుతున్నారు.

– టి.వెంకటేశ్వరరావు, తణుకు

పోలీసు స్టేషన్‌గా రైతు భరోసా కేంద్రం

పాడుబడ్డ భవనంలోకి ఆర్బీకే కేంద్రం



పోలీసు స్టేషన్ నూతన భవనాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ నాగరాణి, ఎస్పీ నయీం, ఎమ్మెల్యే

ఉండి: నియోజకవర్గ కేంద్రం ఉండిలో రైతు భరోసా కేంద్రం పోలీసు స్టేషన్‌గా మారిపోయింది. గత ప్రభుత్వ హయాంలో పోలీసు స్టేషన్ నిర్మాణానికి రైతు భరోసా కేంద్రానికి పక్కగా స్థలం కేటాయించారు. అక్కడే పోలీసు స్టేషన్ కట్టాలని అనేకసార్లు పోలీసు ఉన్నతాధికారులు పర్యవేక్షించి వెళ్లారు. అయితే రైతుల కోసం నిర్మించిన రైతు భరోసా కేంద్రాన్ని.. పోలీసు స్టేషన్‌గా మార్చడంతో రైతులు అవాక్కయ్యారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో నియోజకవర్గ ఇన్‌చార్జి పీవీఎల్ చేతుల మీదుగా ఈ కేంద్రాన్ని ప్రారంభించారు. ఇటీవల ఆర్బీకే సిబ్బందిని ఖాళీ చేయించి ఉండి వ్యవసాయ మార్కెట్ యార్డులో పాడుబడ్డ కార్యాలయానికి తరలించారు. ఆర్బీకేను ఏకంగా పోలీసు స్టేషన్‌గా మార్చేశారు. ఆకివీడు, కాళ్ల పోలీసు స్టేషన్‌లు కూడా ఆయా ప్రాంతాల్లోని రైతు భరోసా కేంద్రాల్లో ఏర్పాటు చేసేందుకు నియోజకవర్గ ప్రజాప్రతినిధి మొగ్గు చూపుతున్నట్లు సమాచారం. ఆకివీడులో రైతు భరోసా కేంద్రాన్ని తరలించాలని చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. కాళ్ల పోలీస్‌స్టేషన్ కాళ్లకూరులోని రైతు భరోసా కేంద్రానికి తరలించాలని చూడటంతో స్థానికులు వ్యతిరేకించారు. రైతుల కోసం నిర్మించిన కేంద్రాలను ఇలా పోలీస్ స్టేషన్లుగా మార్చడంపై తీవ్ర విమర్శలు వస్తున్నాయి.

ఆక్రమణల తొలగింపు ఉద్రిక్తం

మరికొంత సమయం ఇవ్వాలంటూ ఆందోళన



ఆక్రమణల తొలగింపునకు సమయం ఇవ్వాలని ధర్నా చేస్తున్న అయిభీమవరం గ్రామస్తులు

ఆకివీడు: మండలంలోని అయిభీమవరం రోడ్డులో ఆక్రమణల తొలగింపునకు గడువు ఇవ్వాలని బాధితులు సోమవారం ఆందోళనకు దిగారు. ఆకివీడు-అయిభీమవరం రోడ్డులోని బాధితులంతా రోడ్డుపై బైఠాయించి, ధర్నా చేశారు. బాధితులకు సీపీఎం నాయకులు అండగా నిలిచారు. కొంతమంది ఇళ్లను ఖాళీ చేయగా.. పోలీసులు, రెవెన్యూ సిబ్బంది వాటిని కూల్చివేయించారు. మిగిలిన వారు తమంతట తామే ఇళ్లను ఖాళీ చేసుకుంటామని, తొలగించవద్దని పట్టుబట్టారు. అదే సమయంలో సీపీఎం నాయకులు వచ్చి ఆందోళనకారులకు మద్దతు తెలపడంతో ఆందోళన ఉధృతం చేశారు. ఎమ్మెల్యే డౌన్ డౌన్, ఇళ్లు పీకివేయడానికేనా మిమ్మల్ని గెలిపించుకుంది అంటూ నిరసన వ్యక్తం చేశారు. చంద్రబాబు పీకేయమన్నాడా.. పవన్ పీకేయమన్నాడా.. అంటూ ఆవేదన వ్యక్తంచేశారు. పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఒక మహిళ స్పృహతప్పి పడిపోవడంతో ఆందోళనకారులు పోలీసులపై ఆగ్రహం వ్యక్తంచేశారు. సాయంత్రం వరకూ ఆందోళన కొనసాగించారు. ఎమ్మార్వో వెంకటేశ్వరరావు మాట్లాడుతూ సమస్యను పై అధికారులు, ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు. సీపీఎం నాయకులు బీవీ.వర్మ, కె.తవిటినాయుడు, పెంకి అప్పారావు, సందక సూరిబాబు, తదితరులు పాల్గొన్నారు.

దాబా ముసుగులో బార్‌లు






దాబా, రెస్టారెంటు బోర్డు పెట్టి నిర్వహిస్తున్న బార్, నారాయణపురం-గణపవరం రోడ్డులో దాబా, రెస్టారెంట్‌లో మద్యం తాగుతున్న మందుబాబులు

ఏలూరు, టాస్క్‌ఫోర్స్ : ఉంగుటూరు నియోజకవర్గంలో బెల్ట్ షాపులు ఇబ్బడి ముబ్బడిగా ఏర్పాటు చేశారు. రెస్టారెంట్లు, దాబాలు అని చెప్పి లోపల బార్‌లు నిర్వహిస్తున్నారు. స్థానిక నియోజకవర్గ ప్రజాప్రతినిధి కనుసన్నల్లోనే ఇవన్నీ జరుగుతున్నాయని సమాచారం. బార్లను తలపించేలా ఈ రెస్టారెంట్లు నడుపుతున్నారు. ఉంగుటూరు నియోజకవర్గంలో ఓపెన్‌గా దాబాల ముసుగులో బార్‌లు నడవడంతో ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై సీఐ సత్యనారాయణను ప్రశ్నించగా బార్‌లకు ఎలాంటి అనుమతి లేదన్నారు.

ఎస్ఎస్‌సీ పరీక్ష ఫీజుల గడువు పెంపు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): వచ్చే మార్చి, ఏప్రిల్‌లో జరిగే ఎస్ఎస్‌సీ/ఓఎస్ఎస్‌సీ/ఒకేషనల్ పబ్లిక్ పరీక్షలకు రెగ్యులర్ విద్యార్థులతో పాటు గతంలో అనుత్తీర్ణులైన విద్యార్థులు పరీక్ష ఫీజులు చెల్లించడానికి పాఠశాల విద్యాశాఖ గడువు పొడిగించిందని జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకటలక్ష్మమ్మ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 11 వరకూ ఎలాంటి అపరాధ రుసుం లేకుండా పరీక్ష ఫీజు చెల్లించవచ్చని ప్రకటించగా, ప్రస్తుతం పెంచిన గడువు ప్రకారం ఫీజులను ఈ నెల 18వ వరకూ చెల్లించవచ్చన్నారు. రూ.50 అపరాధ రుసుంతో ఈ నెల 19 నుంచి 25 వరకూ, రూ.200 అపరాధ రుసుంతో ఈ నెల 26 నుంచి డిసెంబర్ 3 వరకూ, రూ.500 అపరాధ రుసుంతో డిసెంబర్ 4 నుంచి 10 వరకూ ఫీజులు చెల్లించవచ్చన్నారు.

టెట్‌లో మెరిసిన భాస్కర్



ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఏపీ టెట్ (ఉపాధ్యాయ అర్హత పరీక్ష)లో నగరానికి చెందిన కేదారి భాస్కర్ అత్యుత్తమ ప్రతిభ కనబర్చాడు. సోమవారం విడుదల చేసిన టెట్ ఫలితాల్లో భాస్కర్ మొత్తం 150 మార్కులకు 147.87 మార్కులు సాధించాడు. ఏ ర్యాంక్ వచ్చిందనే విషయంలో స్పష్టత రాలేదు.

మల్చింగ్ షీట్ వినియోగం మానుకోవాలి

జంగారెడ్డిగూడెం: వర్జీనియా పొగాకులో మల్చింగ్ షీట్ వినియోగం మానుకోవాలని వర్జీనియా పొగాకు రీజనల్ మేనేజర్ జీఎల్‌కే ప్రసాద్ అన్నారు. జంగారెడ్డిగూడెం వర్జీనియా వేలం కేంద్రం-2లో సోమవారం రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మల్చింగ్ షీట్ వాడకం వల్ల కలిగే దుష్పరిణామాలు, ఉత్తమ వ్యవసాయ పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు. ఆర్ఎం ప్రసాద్ మాట్లాడుతూ మల్చింగ్ షీట్ వాడకం నేల నీటి నిల్వ సామర్థ్యాన్ని తగ్గిస్తుందని.. భూమిలో జీవ రసాయన చర్యలు, సూక్ష్మజీవ పనితనాన్ని దెబ్బతీస్తాయన్నారు. ప్లాస్టిక్ మల్చింగ్ వల్ల లీఫ్ గ్రేడులో నికోటిన్ తగ్గే అవకాశం ఉందన్నారు.

ఇళ్ల మధ్య మద్యం షాపులా ?



లక్ష్మణేశ్వరం ప్రగతి నగర్ వద్ద ఆందోళన చేస్తున్న గ్రామస్తులు

నరసాపురం రూరల్: నరసాపురం పట్టణం నుంచి పితానిమెరక వెళ్లే రోడ్డులో ప్రగతినగర్ వద్ద నూతనంగా ఏర్పాటు చేస్తున్న మద్యం షాపును దూరంగా తరలించాలని సోమవారం ఆ ప్రాంత ప్రజలు, మహిళలు ధర్నా చేశారు. సమీపంలోనే బీసీ గురుకుల బాలికల పాఠశాల ఉండటంతో విద్యార్థినులు, దిగువ గ్రామాల నుంచి పట్టణానికి వచ్చి, వెళ్లే వారు ఇబ్బంది పడతారని ఆందోళన చేశారు. ఈ ప్రాంతంలో ఇంతవరకూ నిర్వహిస్తున్న హోటల్‌ను ఖాళీ చేయించి మద్యం దుకాణం ఏర్పాటు చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారన్నారు. తమ కుటుంబాల్లోకి మద్యం మహమ్మారిని తీసుకొచ్చి ఘర్షణలు పెట్టొద్దంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. నిత్యం విద్యార్థులు ఇదే రహదారి వెంట ప్రయాణిస్తుంటారని మద్యం షాపు ఏర్పాటు చేస్తే ఎలా అంటూ మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. నరసాపురం ఆర్డీవో దాసి రాజుకు వినతి పత్రం ఇచ్చారు.

యూటీఎఫ్ నూతన కార్యవర్గం ఎన్నిక



నూతనంగా ఎన్నికైన యూటీఎఫ్ ప్రతినిధులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): యూటీఎఫ్ జిల్లా స్వర్ణోత్సవ మహా సభల్లో రెండో రోజు డెలిగేట్స్ మీటింగ్ జిల్లా కార్యాలయంలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా ఎస్‌కే ముస్తాఫా అలీ, ఆర్.రవికుమార్ రెండో సారి ఎన్నికయ్యారు. గౌరవాధ్యక్షుడిగా ఎంవీ శ్యామ్‌బాబు, సహాధ్యక్షులుగా జీ వెంకటేశ్వర రావు, ఎస్.సుధారాణి, కోశాధికారిగా జీవీ రంగమోహన్ ఎన్నికయ్యారు. జిల్లా కార్యదర్శులుగా ఏ విక్టర్, ఏ రాజు, పీ శ్రీనివాస్, పీ వీరకోటి, బీ అనురాధ, ఎన్. రాంబాబు, ఈ శివశంకర రావు, సీహెచ్ శ్రీధర్, జీ దేవానంద్, కే కమల్‌కుమార్, ఎంవీ బేతాళరావు, ఎం.రవిశంకర్, జీ. అంజనాదేవి ఎన్నికయ్యారు.

రేపు భీమడోలులో జాబ్ మేళా

ఏలూరు (ఆర్ఆర్‌పేట): రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, సీడాప్, ఉపాధి కార్యాలయం సంయుక్త ఆధ్వర్యంలో భీమడోలు శ్రీ వేంకటేశ్వర డిగ్రీ కళాశాల(స్కిల్ హబ్)లో ఈ నెల 6న జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ ఇన్‌చార్జ్ ఒక ప్రకటనలో తెలిపారు. సుమారు 160 మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించే అవకాశం ఉందన్నారు. పదో తరగతి, ఇంటర్, ఐటీఐ, డిగ్రీ, పీజీ వంటి విద్యార్హతలు ఉండి 18–30 సంవత్సరాల మధ్య వయసు గల అభ్యర్థులు అర్హులన్నారు. వివరాలకు 8184887146, 9642387539, (9988853335 - టోల్ ఫ్రీ) నెంబర్లలో సంప్రదించవచ్చన్నారు.

క్లుప్తంగా

క్షీరారామలింగేశ్వరస్వామి సన్నిధిలో కేంద్ర మంత్రి



క్షీరారామలింగేశ్వరస్వామిని దర్శించుకున్న కేంద్ర మంత్రి శ్రీనివాసవర్మ

పాలకొల్లు సెంట్రల్: పంచారామక్షేత్రం శ్రీ క్షీరారామలింగేశ్వరస్వామిని కేంద్ర ఉక్కు పరిశ్రమల శాఖ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ సోమవారం దర్శించుకున్నారు. ముందుగా గణపతి పూజ చేసి క్షీరారామలింగేశ్వరస్వామిని, లక్ష్మీపార్వతి అమ్మవార్లను దర్శించుకున్నారు. అనంతరం ఆలయ అర్చకులు ఆయనకు వేద ఆశీర్వచనం చేశారు. ఆలయ ఈవో ముచ్చర్ల శ్రీనివాసరావు స్వామివారి చిత్రపటాన్ని అందజేసి శేషవస్త్రంతో సత్కరించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీనివాసవర్మ మాట్లాడుతూ స్థానిక మంత్రి, దేవదాయ శాఖ మంత్రులతో కలిసి ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. దేవస్థానం ఆస్తులు అన్యాక్రాంతం కాకుండా కాపాడతామని తెలిపారు. కార్యక్రమంలో కేవీ కృష్ణవర్మ, కొల్లి కొండప్రసాద్, నాళం బాబి తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీలో అప్రెంటీస్‌కు దరఖాస్తుల ఆహ్వానం

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఆర్టీసీలో అప్రెంటిస్‌షిప్ చేయడానికి ఐటీఐ అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆర్టీసీ జోనల్ సిబ్బంది శిక్షణ కళాశాల ప్రిన్స్‌పాల్ వీ నీలిమ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు ఏలూరు, పశ్చిమ గోదావరి జిల్లాలతో పాటు ఎన్‌టీఆర్ జిల్లా, కృష్ణా, గుంటూరు, బాపట్ల, పల్నాడు, జిల్లాలకు చెందిన ఐటీఐ ఉత్తీర్ణులైన ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఈ నెల 6వ తేదీ నుంచి 20వ తేదీ వరకూ ఆన్‌లైన్‌లో జిల్లాల వారీగా దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు. ఐటీఐ మార్కులు, సీనియారిటీ ప్రాతిపదికగా అభ్యర్థులను ఎంపిక చేస్తామన్నారు. ఇందుకు సంబంధించిన పూర్తి వివరాలు ఏపీఎస్‌ఆర్టీసీ వెబ్‌సైట్‌లో రిక్రూట్‌మెంట్స్ పేజీలో పొందుపరిచినట్లు తెలిపారు.

అభివృద్ధి ప్రణాళిక కోసం శిక్షణ

ఏలూరు(మెట్రో): గ్రామ పంచాయతీల అభివృద్ధి ప్రణాళిక 2025–26 తయారీపై మంగళవారం నుంచి శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు జెడ్పీ సీఈవో కేఎస్‌ఎస్ సుబ్బారావు తెలిపారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని 48 మండలాలకు సంబంధించి ఈ నెల 5, 6 తేదీలలో 24 మండలాలకు, 7, 8 తేదీలలో మిగతా 24 మండలాలకు రెండు బ్యాచులుగా నిర్వహించడం జరుగుతుందన్నారు. ప్రతి మండలం నుంచి ఎంపీడీవో, ఈవోపీఆర్‌డీ, ఇద్దరు పంచాయతీ కార్యదర్శులు, ఒక డిజిటల్ అసిస్టెంట్ లేదా ఒక కంప్యూటర్ ఆపరేటర్, లైన్ డిపార్ట్‌మెంట్స్‌కు సంబంధించిన జిల్లా అధికారులు హాజరవుతారని సీఈవో తెలిపారు. ఈ శిక్షణల ద్వారా క్షేత్రస్థాయిలో రాబోయే సంవత్సరపు ప్రణాళిక సక్రమంగా తయారీ, అమలు జరుగుతుందన్నారు. పంచాయతీల అభివృద్ధికి కావాల్సిన నిధుల విడుదలలో సమస్యలు రాకుండా చూసుకునేందుకు ఈ శిక్షణ దోహదపడుతుందన్నారు.

పోక్సో కేసు నమోదు

జంగారెడ్డిగూడెం: మైనర్ బాలికపై లైంగిక వేధింపులకు పాల్పడిన నేరంపై ఓ యువకుడిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్సై షేక్ జబీర్ తెలిపారు. మండలంలోని జొన్నవారిగూడెంకు చెందిన ఓ బాలికకు మాయమాటలు చెప్పి గత నెల 18వ తేదీన వేగవరానికి చెందిన పి.నాగశివ అనే వ్యక్తి లైంగిక వేధింపులకు పాల్పడ్డాడని బాలిక తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. నాగశివపై పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

విలీన మండలాల్లో అయోమయం

- కాంటూర్‌పై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పొంతన లేని వ్యాఖ్యలు
- ఆర్‌అండ్‌ఆర్ పరిహారం కోసం నిర్వాసితుల ఎదురుచూపులు



గోదావరి వరదల్లో ముంపునకు గురైన కుక్కునూరు గ్రామంలోని ఇళ్లు

కుక్కునూరు : పోలవరం ప్రాజెక్ట్ ఎత్తు 41.15 కాంటూర్‌కు మాత్రమే పరిమితం అంటూ వస్తున్న వార్తలు విలీనమండలాల ప్రజలను అయోమయానికి గురిచేస్తున్నాయి. రాష్ట్ర విభజన నేపథ్యంలో పోలవరం ప్రాజెక్ట్ కోసం ఆంధ్రప్రదేశ్‌లో విలీనం చేసిన కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లో ప్రాజెక్ట్ పరిధిలో ముంపునకు గురవుతున్న భూములకు ప్రభుత్వం 2016, 2017వ సంవత్సరంలో పరిహారం చెల్లించింది. ఇది జరిగి దాదాపు ఏడేళ్లు పూర్తయినా ఇంతవరకు ఆర్‌అండ్‌ఆర్ పరిహారం చెల్లించలేదు. ఎప్పుడు చెల్లిస్తామన్న స్పష్టమైన హామీ కూడా ప్రభుత్వం తరపున రావడంలేదు. ఈ తరుణంలో ఓ పక్క కేంద్ర ప్రభుత్వం ప్రాజెక్ట్ ఎత్తు 41.15 మీ కే పరిమితం అంటూ ప్రకటనలు చేయడం, మరో పక్క రాష్ట్ర ప్రభుత్వం 45 కాంటూర్ వరకు నిర్మిస్తామని ప్రకటిస్తుండడం వింటుంటే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వాసితులకు పునరావాస కల్పనపై వ్యవహరిస్తున్న తీరు త్రిశంకు స్వర్గంలా ఉందని నిర్వాసితులు వ్యాఖ్యానిస్తున్నారు.

41.15 కాంటూర్ పరిధిలో పూర్తికాని పరిహారం చెల్లింపు

పోలవరం బ్యాక్ వాటర్‌లో ఎఫ్‌ఆర్‌ఎల్ (ఫుల్ రిజర్వాయర్ లెవల్)లో ముంపునకు గురవుతున్న భూముల మొత్తానికి ప్రభుత్వం పరిహారం అందించింది. భూములకు పరిహారం చెల్లించి ఏడేళ్లు పూర్తయినా ఆర్‌అండ్‌ఆర్ పరిహారం వద్దకు వచ్చేసరికి 41.15 కాంటూర్ పరిధిలోని వారికే పరిహారం పూర్తిగా చెల్లింపు ప్రక్రియ జరగలేదు.

అసలు పరిహారం ఇస్తారా.. ఇవ్వరా?

పోలవరం ప్రాజెక్ట్ ఎత్తుపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేస్తున్న ప్రకటనలు సమన్వయంగా లేని నేపథ్యంలో ప్రాజెక్ట్ ఎత్తు 41.15 మీ కే పరిమితం అయితే 45 కాంటూర్ పరిధిలోని గ్రామాలకు పరిహారం ఇస్తారా లేదా అన్న సందేహంలో నిర్వాసితులు కొట్టుమిట్టాడుతున్నారు. అలాగని 45 కాంటూర్ పరిధిలోని గ్రామాలను తరలింపు చేయకుండా ఉంచితే భూముల సేకరణ పూర్తయిన నేపథ్యంలో ఆ గ్రామాల్లోని ప్రజల భవిష్యత్తు ఏమిటన్నది అగమ్యగోచరం.

పరిహారం చెల్లింపులో స్పష్టత కరువు

ప్రాజెక్ట్ నిర్మాణాన్ని ప్రణాళిక బద్ధంగా పూర్తి చేస్తామని చెప్తున్న ప్రభుత్వం నిర్వాసితుల పరిహారం చెల్లింపు, పునరావాస కల్పనపై స్పష్టత ఇవ్వటం లేదు. ప్రభుత్వానికే స్పష్టత లేనప్పుడు ఇక నిర్వాసితులకు ఏ న్యాయం చేస్తారని నిర్వాసితులు అంటున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం నిర్వాసితుల పరిహారం చెల్లింపుపై దృష్టి పెట్టాలని కోరుతున్నారు.

పరిహారం ఎగ్గొట్టేందుకే..



కాంటూర్ లెక్కలు అడ్డం పెట్టుకొని పరిహారం ఇవ్వకుండా ఎగ్గొట్టాలని ప్రభుత్వం చూస్తుంది. ఇటీవల ప్రాజెక్ట్ కోసం విడుదల చేసిన రూ.2500 కోట్ల నిధుల్లో పునరావాసానికి ఎంత కేటాయించింది ప్రభుత్వం ఇంతవరకు చెప్పలేదు. కూటమి ప్రభుత్వంలో బీజేపీ భాగమై ఉన్నా ప్రాజెక్ట్‌పై పూర్తి స్పష్టత ఇవ్వలేకపోతున్నారు. దీనిని బట్టి చూస్తే నిర్వాసితుల భవితవ్యం జలసమాధేనని అర్థమవుతుంది. మండలాన్ని యూనిట్‌గా తీసుకోని పరిహారం ఇస్తేనే నిర్వాసితులకు న్యాయం జరుగుతుంది.

– ఎ రవికుమార్, సీపీఎం , జిల్లా కార్యదర్శి

ఆర్‌అండ్‌ఆర్‌పై స్పష్టత ఇవ్వాలి



నిర్వాసితులకు ఆర్‌అండ్‌ఆర్ పరిహారం ఎప్పుడిస్తారన్నది నిర్దిష్టంగా ప్రకటించాలి. అంతేకాక ఆర్‌అండ్‌ఆర్ పరిహారం 2017 కటాఫ్ డేట్ ఆధారంగా కాక పరిహారం ఇచ్చేనాటికి 18 సంవత్సరాలు వయస్సున్న వారందరికి పరిహారం చెల్లించాలి.

– షేక్ గౌస్, సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా, ఏలూరు జిల్లా కార్యదర్శి

డిసెంబర్ 14న జాతీయ లోక్‌అదాలత్

డీఎల్‌ఎస్‌ఏ జిల్లా కార్యదర్శి కె.రత్నప్రసాద్



ఏలూరు (టూటౌన్) : రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ అమరావతి ఆదేశాల ప్రకారం డిసెంబర్ 14వ తేదీన ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా వ్యాప్తంగా జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్ తెలిపారు. స్థానిక జిల్లా కోర్టు ఆవరణలోని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ భవనం నందు సోమవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు తెలియజేశారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని అన్ని కోర్టుల పరిధిలో నిర్వహించే ఈ జాతీయ లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రాజీ యోగ్యమైన అన్ని క్రిమినల్, సివిల్ కేసులు, వాహన ప్రమాద బీమా, కుటుంబ వివాదాలు, చిట్ ఫండ్స్ వివాదాలు, బ్యాంకు లావాదేవీల కేసులు, టెలిఫోన్ బకాయిలు, మున్సిపల్ ఆస్తి, నీటి పన్నుల కేసులను ఈ లోక్ అదాలత్ నందు రాజీ చేయడం జరుగుతుందని తెలిపారు. కేసుల పరిష్కారానికి సమస్యలు ఎదురైతే 08812 224555 నందు సంప్రదించాలని రత్నప్రసాద్ సూచించారు.

చేతబడి కేసులో ఆరుగురి అరెస్ట్

నిందితులకు 15 రోజుల రిమాండ్



కైకలూరు సీఐ కార్యాలయంలో చటాకాయ గ్రామంలో చేతబడి కేసును వివరిస్తున్న సీఐ, ఎస్సైలు

కైకలూరు: మానవత్వం మచ్చుకైనా లేకుండా చేతబడి నెపంతో ముగ్గురిపై పాశవిక దాడి చేసిన నిందితులు ఎట్టకేలకు జైలు పాలయ్యారు. కేసు వివరాలను కైకలూరు రూరల్ సర్కిల్ కార్యాలయంలో సీఐ వి.రవికుమార్, రూరల్ ఎస్సై వి.రాంబాబు సోమవారం వివరించారు. చటాకాయ గ్రామానికి చెందిన ఉప సర్పంచ్ భర్త ఘంటసాల చిన సుబ్బరాజుకు అదే గ్రామంలో సైదు రఘునకు నీటి తూముల విషయంలో కొద్ది రోజుల క్రితం గొడవ జరిగింది. ఇది మనసులో పెట్టుకుని తనపై చేతబడి చేస్తున్నాడని సుబ్బరాజు ఈ నెల 26న పెద్దల పంచాయతీ పెట్టడంతో రఘును పిల్లర్‌కు కట్టి కొట్టారు. ఇంకా చేతబడిలో సహకరించిన వ్యక్తులు ఎవరున్నారని తీవ్రంగా కొట్టడంతో రఘు భయంతో మోరు రాంబాబు, జయమంగళ ధనుంజయతో సహా మరో 9 మంది పేర్లు చెప్పాడు. దీంతో రాంబాబు, ధనుంజయను కూడా కట్టేసి కొట్టారు. ఇరువురు క్షతగాత్రులు ఏలూరు ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందారు. ఈ ఘటనపై రఘు ఫిర్యాదుతో 29న దాడి చేసిన 18మందిపై పోలీసులు కేసు నమోదు చేశారు. చివరికి ప్రధాన నింధితులైన ఘంటసాల చిన సుబ్బరాజు(49), దేశింగిరాజు(55), కుటుంబరావు(50), ముంగర గంగాథరరావు(48), బలే చంద్రం(49), శ్రీవేంకటేశ్వర్లు(35)లను అరెస్ట్ చేశారు. కైకలూరు మేజిస్ట్రేట్ నిందితులకు మచిలీపట్నం జైలుకు 15 రోజుల రిమాండ్ విధిస్తూ తీర్పు ఇచ్చినట్లు సీఐ చెప్పారు. గ్రామంలో నీటి తూముల విషయంలో జరిగిన గొడవ తప్ప చేతబడి కాదన్నారు. గ్రామ ప్రజలకు మూఢనమ్మకాలపై జన చైతన్య వేదిక ద్వారా అవగాహన కలిగిస్తామని సీఐ చెప్పారు.

తణుకులో మిన్నంటిన రోదనలు

- ఉండ్రాజవరం మండలం తాడిపర్రులో ఫ్లెక్సీ ఏర్పాటు చేస్తుండగా ప్రమాదం
- విద్యుత్ షాక్‌తో నలుగురి దుర్మరణం, మరో ముగ్గురికి గాయాలు
- మృతుల బంధువుల రోదనలతో దద్దరిల్లిన తణుకు ప్రభుత్వాసుపత్రి



తణుకు ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో మృతుల బంధువుల రోదనలు



మార్చురీలో మృతదేహాలను సందర్శించిన మంత్రి వాసంశెట్టి సుభాష్

తణుకు : తణుకు ప్రభుత్వాసుపత్రి వద్ద సోమవారం తెల్లవారుజామును మృతుల బంధువుల రోదనలు మిన్నంటాయి. ఫ్లెక్సీ ఏర్పాటు చేస్తుండగా జరిగిన ప్రమాదం ఆ కుటుంబాల్లో తీరని శోకం మిగిల్చింది. ఉండ్రాజవరం మండలం తాడిపర్రు గ్రామంలో పాపన్న గౌడ్ విగ్రహావిష్కరణ సందర్భంగా ఫ్లెక్సీ ఏర్పాటు చేస్తున్న క్రమంలో ఏడుగురు వ్యక్తులు విద్యుత్ షాక్‌కు గురయ్యారు. ఈ ప్రమాదంలో నలుగురు దుర్మరణం చెందారు. మరొకరి పరిస్థితి విషమంగా ఉండగా ఇద్దరికీ స్వల్ప గాయాలయ్యాయి. ప్రమాదంలో మృతి చెందిన బొల్లా వీర్రాజు, కాసగాని కృష్ణ, పామర్తి నాగేంద్ర, మారిశెట్టి మణికంఠ మృతదేహాలకు తణుకు ప్రభుత్వాసుపత్రిలో ఉండ్రాజవరం ఎస్సై జి.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు. తీవ్రంగా గాయపడిన కోమటి అనంతరావును చికిత్స నిమిత్తం తణుకులోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా అనంతరం మెరుగైన వైద్యం నిమిత్తం కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. స్వల్ప గాయాలైన కోమటి వీరవెంకట సత్యనారాయణ, వెలిగట్ల పవన్‌కల్యాణ్‌కు తణుకు ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య సేవలందిస్తున్నారు. ప్రమాద ఘటన తెలుసుకున్న రాష్ట్ర మంత్రులు కందుల దుర్గేష్, వాసంశెట్టి సుభాష్ తణుకు ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకుని మృతుల బంధువులను పరామర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం తరపున అన్ని విధాలుగా ఆదుకుంటామని హామీ ఇచ్చారు. చికిత్స పొందుతున్న బాధితులను పరామర్శించి మెరుగైన వైద్యం అందించాలని వైద్యాధికారులను ఆదేశించారు.

ఎస్సీ వర్గీకరణపై 'సుప్రీం' తీర్పును వ్యతిరేకిస్తున్నాం

మాల సంఘాల జేఏసీ ఛైర్మన్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాల జేఏసీ నాయకులు

ఏలూరు (టూటౌన్): ఎస్సీ వర్గీకరణపై ఇటీవల సుప్రీం ఇచ్చిన తీర్పును తాము వ్యతిరేకిస్తున్నట్లు అఖిల భారత మాల సంఘాల జేఏసీ ఛైర్మన్ రిటైర్డ్ ఐఆర్‌ఎస్ అధికారి డాక్టర్ ఉప్పులేటి దేవిప్రసాద్ తెలిపారు. స్థానిక ఇండోర్ స్టేడియం ఎదురుగా ఉన్న లేడీస్ క్లబ్ నందు సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సీ రిజర్వేషన్లపై సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు భారత రాజ్యాంగానికి వ్యతిరేకమని, దీన్ని దేశంలోని 28 రాష్ట్రాలు వ్యతిరేకిస్తున్నాయన్నారు. వాస్తవాలు తెలియజేయాలనే ఉద్దేశంతో మాల సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో ఈ నెల 26వ తేదీన తలపెట్టిన హలో మాల.. చలో అమరావతి భారీ బహిరంగ సభకు మాలలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాల్సిందిగా కోరారు. అఖిల భారత మాల సంఘాల జేఏసీ గౌరవ సలహాదారుడు, ఏఐఏవైఎస్ జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ మెండెం సంతోష్ కుమార్ మాట్లాడుతూ భారత రాజ్యాంగంలో క్రిమీలేయర్ అనే పదం లేదన్నారు. ఎస్సీ సామాజిక వర్గానికి అంటరానితనం ఆధారంగా రిజర్వేషన్లు కల్పించబడినవే తప్పా ఆర్థిక పరిస్థితి మీద కాదు అనే విషయాన్ని అర్థం చేసుకోవాలన్నారు. విలేకరుల సమావేశంలో జేఏసీ నాయకులు పంతగాని రమేష్, అలగా రవి, నూకపెయ్యి కార్తీక్, పల్లెం ప్రసాద్, మెండెం రాంబాబు, ఇ.విజయ్, మెండెం ఆనంద్, గొల్లకిరణ్, దిలీప్, జి.నరేష్, పాము మాన్‌సింగ్, అంబటి నాగేంద్ర, నేతల రమేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

కందిరీగలు కుట్టి వ్యక్తి మృతి

- మృతదేహంతో రహదారిపై గ్రామస్తుల నిరసన
- ఆర్‌ఎంపీ వైద్యుడి నిర్లక్ష్యమే కారణమంటూ ఆరోపణ



సత్యనారాయణ మృతదేహంతో ధర్నా చేస్తున్న గ్రామస్తులు

దెందులూరు: కందిరీగలు కుట్టి ఓ వ్యక్తి మృతి చెందాడు. ఆర్‌ఎంపీ వైద్యుడి నిర్లక్ష్యం కారణంగానే ఆ వ్యక్తి మృతి చెందాడని గ్రామస్తులు రహదారిపై ఆందోళనకు దిగారు. వివరాల ప్రకారం.. దెందులూరు మండలం చల్ల చింతలపూడి గ్రామానికి చెందిన వేముల సత్యనారాయణ (52) కొబ్బరి బొండాల లోడ్ పనికి వెళ్తూ ఉంటాడు. ఆదివారం వీరభద్రం అనే వ్యక్తి కొబ్బరి బొండాలు కోస్తుండగా సత్యనారాయణను, మరో బాలికను కందిరీగలు కుట్టాయి. గాయపడిన వారిని పంగిడిగూడెం ఆర్‌ఎంపీ వద్దకు తీసుకువెళ్లి వైద్యం చేయించారు. అయితే సాయంత్రం 6 గంటల సమయంలో సత్యనారాయణ మృతి చెందాడు. దీంతో గ్రామస్తులు, కుటుంబ సభ్యులు సత్యనారాయణ మృతదేహంతో ఏలూరు- ద్వారకాతిరుమల ప్రధాన రహదారిపై ధర్నాకు దిగారు. దీంతో ట్రాఫిక్ స్తంభించిపోయింది. ఏఎస్సై వెంకటేశ్వరరావు, సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని బాధితులకు నచ్చజెప్పడంతో వారు శాంతించారు. అనంతరం సత్యనారాయణ మృతదేహాన్ని ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి శవ పరీక్షల నిమిత్తం తరలించి కేసు నమోదు చేశారు. దీనిపై ఆర్‌ఎంపీ మాట్లాడుతూ తాను ప్రాథమిక చికిత్స మాత్రమే చేశానని, సత్యనారాయణ మృతిపై తనకు సంబంధం లేదని తెలిపారు.

బంగారం తాకట్టు వ్యాపారికి టోకరా

రూ 2.50 లక్షల విలువైన నగలతో పరార్

నరసాపురం: నరసాపురంలో బంగారం తాకట్టు వ్యాపారికి ఓ వ్యక్తి టోకరా వేశాడు. రూ.2.50 లక్షల విలువైన బంగారు నగలతో పరారయ్యాడు. దీనికి సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని బులియన్ మార్కెట్‌లో అడ్డగళ్ల బ్యాంకర్స్ పేరుతో నడిచే తాకట్టు వ్యాపారి వద్దకు సోమవారం సాయంత్రం ఓవ్యక్తి వచ్చాడు. మీ బంధువైన అళ్లగడ్డ కామేష్ గతంలో మీ వద్ద కొంత బంగారం తాకట్టు పెట్టాడని, వాటిని విడిపించుకురమ్మని తనను పంపాడని చెప్పాడు. తాకట్టు వివరాలు ఉండే పుస్తకాన్ని గుమస్తా తనిఖీచేయగా, వచ్చిన వ్యక్తి చెప్పిన పేరు ఉండటంతో లాకరు తెరిచి రెండు బంగారు గాజులు బయటపెట్టాడు. షాపు యజమాని లాకర్‌కు తాళం వేయడానికి వెళ్లి వచ్చేసరికి ఆ వ్యక్తి రెండు గాజులు పట్టుకుని పరారయ్యాడు. దీనిపై షాపు యజమాని పోలీసులను ఆశ్రయించగా టౌన్ ఎస్సై జయలక్ష్మి షాపు వద్దకు వెళ్లి ప్రాథమిక దర్యాప్తు చేశారు. తెలిసిన వ్యక్తే ఈ చోరీకి పాల్పడి ఉంటాడని పోలీసులు ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చారు.

జాతీయ బాస్కెట్‌బాల్ పోటీలకు ఇద్దరు ఎంపిక



రాష్ట్ర జట్టులో చోటు సాధించిన జిల్లా క్రీడాకారులు

ఏలూరు రూరల్: జాతీయస్థాయి స్కూల్‌గేమ్స్ బాస్కెట్‌బాల్ పోటీలకు జిల్లాకు చెందిన ఇద్దరు విద్యార్థులు ఎంపికైనట్లు ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు కృష్ణారెడ్డి, కార్యదర్శి గవ్వ శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 2 నుంచి 4వ తేదీ వరకూ పల్నాడులో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో ఏలూరు కస్తూరిబా బాలికల పాఠశాలకు చెందిన ఎం యోగశ్రీ,, బాలుర విభాగంలో దెందులూరు మండలం కొవ్వలి జెడ్పీ పాఠశాలకు చెందిన ఇ చార్లెస్‌వెస్లీ ప్రతిభ కనబరిచి జాతీయ పోటీల్లో పాల్గొనే అవకాశం దక్కించుకున్నారని పేర్కొన్నారు. ఈ నెల 18 నుంచి 22వ తేదీ వరకూ చత్తీస్‌గడ్ రాష్ట్రం రాజనందిగంలో జరిగే 68వ జాతీయ స్కూల్‌గేమ్స్ బాస్కెట్‌బాల్ పోటీల్లో వీరు పాల్గొంటారన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో 13 మందికి కోర్టు జరిమానా

ఏలూరు టౌన్: డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడిన 13 మందికి కోర్టు జరిమానా విధించినట్లు ఏలూరు ట్రాఫిక్ సీఐ ఎస్.లక్ష్మణరావు తెలిపారు. ఎస్పీ కొమ్మి ప్రతాప్ శివకిషోర్ ఆదేశాల మేరకు ఏలూరు డీఎస్పీ డీ.శ్రావణ్‌కుమార్ పర్యవేక్షణలో ట్రాఫిక్ పోలీసులు ఈనెల 3న రాత్రి 7 నుంచి 10.30 గంటల వరకూ ఏలూరు పాతబస్టాండ్ సెంటర్‌లో డ్రంక్ అండ్ డ్రైవ్ స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. మద్యం తాగి మోటార్‌సైకిళ్లు నడుపుతున్న 13 మందిని అదుపులోకి తీసుకుని, స్టేషన్ బెయిల్‌తో ఇళ్లకు పంపారు. సోమవారం ఉదయం వారిపై న్యాయస్థానంలో చార్జిషీట్ దాఖలు చేయగా ఫస్ట్ స్పెషల్ జ్యుడీషియల్ సెకెండ్ క్లాస్ మేజిస్ట్రేట్ రూ.36 వేలు జరిమానా విధించారు.

వృద్ధురాలిపై దాడి.. బంగారపు గొలుసు చోరీ

కామవరపుకోట: ఒంటరిగా ఉన్న వృద్ధురాలిపై దాడి చేసి మెడలో ఉన్న గొలుసు చోరీ చేసిన ఘటన కామవరపుకోటలో చోటు చేసుకుంది. బంధువులు, తడికలపూడి ఎస్సై చెన్నారావు తెలిపిన వివరాల ప్రకారం స్థానిక పాతూరుకు చెందిన వృద్ధురాలు టోకూరి మంగమ్మ చింతలపూడి రోడ్డులో గత కొన్నేళ్లుగా ఒంటరిగా నివాసం ఉంటోంది. ఈ క్రమంలో సోమవారం సాయంత్రం గుర్తు తెలియని వ్యక్తి మంగమ్మ ఇంటిలోకి వెళ్లి కర్రతో దాడి చేసి, ఆమె మెడలో ఉన్న బంగారపు గొలుసును బలవంతంగా లాక్కుని పారిపోయాడు. గాయాలపాలైన వృద్ధురాలు అరవటంతో స్థానికులు గమనించి తడికలపూడి పోలీసులకు సమాచారం అందించారు. జంగారెడ్డిగూడెం సీఐ కృష్ణబాబు, తడికలపూడి ఎస్సై చెన్నారావు ఘటనా స్థలానికి చేరుకుని వృద్ధురాలిని చికిత్స నిమిత్తం జంగారెడ్డిగూడెం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెన్నారావు తెలిపారు.

పురుగు మందు తాగి..

ఏలూరు టౌన్: మనస్తాపానికి గురైన ఓ వృద్ధుడు పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కొయ్యలగూడెం మండలం అంకాలవారిగూడేనికి చెందిన యర్రా వెంకయ్య (65) ఈనెల 3వ తేదీన తన భార్యతో గొడవ పడ్డాడు. మనస్తాపానికి గురై పురుగు మందు తాగి తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. కుటుంబ సభ్యులు గమనించి ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అనంతరం సోమవారం ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఆసుపత్రి వైద్యులు ఎమ్మెల్సీగా నమోదు చేసి ఆసుపత్రి ఔటోపోస్టు పోలీసులకు సమాచారం ఇచ్చారు.

కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిపై ఉద్యమించాలి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న రైతు సంఘాల నాయకులు

ఏలూరు (టూటౌన్) : కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిపై అన్ని వర్గాలకు చెందిన వారు ఉద్యమించాలని రైతు, కార్మిక సంఘాలు పిలుపునిచ్చాయి. సోమవారం ఏలూరులో అన్నే భవనంలో రైతు, కార్మిక సంఘాల నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్, కాంగ్రెస్ కిసాన్ సెల్ జిల్లా నాయకులు రాజనాల రామ్మోహనరావు, బీకేఎంయూ జిల్లా అధ్యక్షుడు బండి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ మూడోసారి అధికారం చేపట్టిన బీజేపీ ప్రభుత్వం తన విధానాలను ఏమాత్రం మార్చుకోలేదన్నారు. రైతులు పండిస్తున్న అన్ని పంటలకూ కనీస మద్దతు ధర చెల్లించాలని, స్వామినాథన్ కమిషన్ సిఫార్సులను అమలు చేయాలని డిమాండ్‌చేశారు. ఈ నెల 26న జిల్లాలోని రైతులు, కౌలు రైతులు, వ్యవసాయ కార్మికులు, ఉద్యోగ, ఉపాధ్యాయ, వివిధ రంగాలకు చెందిన కార్మికులందరూ పెద్దఎత్తున అర్జీలతో కేంద్రానికి హెచ్చరికలు జారీ చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈమేరకు ఈనెల 9వ తేదీన ఏలూరులో సీఐటీయూ జిల్లా కార్యాలయంలో జిల్లా సన్నాహక సమావేశం నిర్వహిస్తున్నామని చెప్పారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి డీఎన్‌వీడీ ప్రసాద్, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు రెడ్డి శ్రీనివాస డాంగే పాల్గొన్నారు.

రుణం ఇప్పిస్తామంటూ మోసం

భీమవరం: ఇంటి నిర్మాణానికి బ్యాంకు రుణం ఇప్పిస్తానని ఓ వ్యక్తిని మోసం చేసిన నేరంపై సోమవారం భీమవరం టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఎస్సై రెహమాన్ తెలిపిన వివరాల ప్రకారం అత్తిలి మండలం బల్లిపాడుకు చెందిన టి.శ్రీనివాసరావుకు తణుకు పక్కన పైడిపర్రుకు చెందిన రాజు, రమణ పరిచయం అయ్యారు. భీమవరంలోని ఒక బ్యాంకులో రుణం ఇప్పిస్తామని అతని వద్ద ఆధార్, పాన్ కార్డు వంటివి తీసుకున్నారు. అయితే కొన్ని రోజుల తర్వాత హైదరాబాద్ రాణిగంజ్ ప్రాంతంలోని ఓ బ్యాంక్ నుంచి రుణం బాపతు వాయిదా చెల్లించాలంటూ శ్రీనివాసరావుకు నోటీస్ వచ్చింది. దీనిపై ఆరా తీసిన శ్రీనివాసరావుకు తన పేరిట రూ.9 లక్షలు రుణం తీసుకుని రాజు, రమణ మోసగించారని అర్థమైంది. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు ఎస్సై రెహమాన్ చెప్పారు.

6, 7 తేదీల్లో రాష్ట్రస్థాయి అథ్లెటిక్ పోటీలు

ఉంగుటూరు: ఈనెల 6, 7 తేదీల్లో ఉంగుటూరు మండలం కైకరం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో రాష్ట్రస్థాయి అథ్లెటిక్ పోటీలు జరుగుతాయని డీవైఈవో రవీంద్ర భారతి తెలిపారు. ఈ పోటీలకు 13 జిల్లాల నుంచి 650 మంది క్రీడాకారులు, 100 మంది పీడీలు కోచ్‌లు హాజరవుతారని వెల్లడించారు. సోమవారం టోర్నమెంట్ ఏర్పాట్లపై ఆమె సమావేశం నిర్వహించారు. వ్యాయామ ఉపాధ్యాయులతో వివిధ కమిటీలు ఏర్పాటు చేసి టోర్నమెంటును విజయవంతం చేయాలని కోరారు. క్రీడాకారులకు అల్పాహారం, భోజనం ఉచితంగా ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తున్నట్లు హెచ్‌ఎం గుళ్ల ప్రసాదరావు తెలిపారు. ఈ సమావేశంలో స్కూల్ గేమ్స్ జిల్లా కార్యదర్శి అలివేలు మంగతాయారు, నాగసుధ, ఆదిరెడ్డి సత్యనారాయణ, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

స్పందన ఫౌండేషన్ సేవలు అభినందనీయం


భవిత సెంటర్‌లో న్యూట్రిషన్ ఫుడ్ అందజేస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): స్పందన ఫౌండేషన్ సేవలు అభినందనీయమని పలువురు కొనియాడారు. పట్టణ భవిత దివ్యాంగుల శిక్షణ కేంద్రంలో శిక్షణ పొందుతున్న దివ్యాంగుల పిల్లలకు స్పందన అధ్యక్షురాలు భోగిరెడ్డి ఆదిలక్ష్మి ఆధ్వర్యంలో సోమవారం ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు న్యూట్రిషన్ ఫుడ్ ఫాకెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో తాడాల సూర్యకుమారి, కోరశిఖ అనురాధ, మేడ సుభద్రా రాణి, మిరియాల విజయలక్ష్మి, ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం బి.జ్యోతి, ఉపాధ్యాయిని కుమారి, ప్రత్యేక ఉపాధ్యాయులు ఎస్‌కే బాలీశ్వరయ్య, ఎం.చంద్రకుమారి, నాగలక్ష్మి విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

చెస్‌లో ప్రతిభ చాటిన విద్యార్థి


విద్యార్థి రిత్విక్

తాడేపల్లిగూడెం రూరల్: తాడేపల్లిగూడేనికి చెందిన ఎస్.రితివ్క్ అనే విద్యార్థి ఇంటర్నేషనల్ ఓపెన్ ఫిడే ర్యాపిడ్ రేటింగ్ టోర్నమెంట్‌లో ప్రతిభ కనబర్చి 1547వ ర్యాంకు సాధించాడు. అంతర్జాతీయ స్థాయిలో అండర్–9 కేటగిరీలో మూడో స్థానాన్ని కైవసం చేసుకున్నాడు. ఈ నెల 19న జరగనున్న అండర్–13 స్టేట్ లెవల్ చెస్ పోటీల్లో పాల్గొననున్నాడు. ఈ విషయాలను పెదతాడేపల్లిలో గల లోటస్ పాఠశాల ప్రిన్సిపాల్ దేవీప్రియ సోమవారం వెల్లడించారు.

నడక ఆరోగ్యానికి మేలు


నిట్ వాకథాన్‌లో విద్యార్థులు

తాడేపల్లిగూడెం: ఐక్యతా నడక ఆరోగ్యానికి మేలు చేస్తుందని ఏపీ నిట్ డీన్ స్టూడెంట్ వెల్ఫేర్ డాక్టర్ జీబీ.వీరేష్‌కుమార్ అన్నారు. సోమవారం నిట్‌లో ఏర్పాటుచేసిన వాకథాన్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఆరోగ్యమే సమజాభివృద్ధికి మూలమన్నారు. ప్రతీ విద్యార్థి పటేల్ ఆశయ సాధనకు కృషి చేయాలన్నారు. ఆరోగ్యవంతమైన సమాజం దేశాన్ని బలోపేతం చేస్తుందన్నారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ ఐక్యభారతదేశం ఆయన దార్శనికతకు నిదర్శనమన్నారు. ప్రతి విద్యార్థి దృఢంగా ఉండటానికి వాకథాన్ కార్యక్రమం ఉపయోగపడుతుందన్నారు. విద్యార్థులు కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొన్నారు.

ఆరుగొలనులో బీటీ రోడ్డుకు ఎమ్మెల్యే శంకుస్థాపన


ఆరుగొలనులో బీటీ రోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని ఆరుగొలను గ్రామంలో రూ.37.50 లక్షలతో నిర్మించనున్న 900 మీటర్ల బీటీ రోడ్డుకు సోమవారం ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన ప్రజల అభీష్టం మేరకు పార్టీలకతీతంగా తాము పనిచేస్తామన్నారు. వర్గాలను తీసుకొస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసే బాధ్యత తాను తీసుకున్నానన్నారు. గ్రామ సర్పంచ్ బుచ్చిబాబు, జనసేన మండల అధ్యక్షుడు అడపా ప్రసాద్, ప్రత్తిపాడు గ్రామ అధ్యక్షుడు జగత్ సోమశేఖర్, మట్టా రాంబాబు, వీర్ల కృష్ణ, పైబోయిన వెంకట్రామయ్య, ఆరుగొలను కూటమి నాయకులు పాల్గొన్నారు.

టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు అందించాలి


సమావేశంలో మాట్లాడుతున్న బలరాం

భీమవరం: పట్టణాల్లోని టిడ్కో ఇళ్లను తక్షణం లబ్ధి దారులకు పంపిణీ చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం డిమాండ్ చేశారు. భీమవరం మెంటేవారి తోట సుందరయ్య భవనంలో ఎం.వైకుంఠరావు అధ్యక్షతన నిర్వహించిన సీపీఎం పట్టణ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇళ్ల కోసం లబ్ధిదారులు రూ.లక్షలు అప్పు చేసి ప్రభుత్వానికి కట్టినా ఇంత వరకు పూర్తిగా లబ్ధిదారులకు ఇళ్లు అప్పగించకపోవడం దారుణమన్నారు. జిల్లా కేంద్రమైన భీమవరంలో డంపింగ్ యార్డ్ లేకపోవడం చెత్త ఎక్కడ పడితే అక్కడ వేయడం వలన దోమలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. సమస్యలను వెంటనే పరిష్కరించకపోతే ఆందోళన చేస్తామన్నారు.

పేదల చదువుకు ప్రోత్సాహం ఏది?

- పేదలపాలిట గుదిబండగా కూటమి ప్రభుత్వం
- అప్పలు చేసి ఫీజులు కట్టాల్సి వస్తుందంటున్న తల్లిదండ్రులు
- గతంలో చదివిస్తున్నామనే తెలియకుండా ఉండేది
- విద్యాదీవెన, వసతి దీవెన, తల్లికి వందనం ఇవ్వరా?


తణుకులో శ్రీచిట్టూరి ఇంద్రయ్య ప్రభుత్వ డిగ్రీ కళాశాల

జగన్ ప్రభుత్వ హయాంలో (జూన్ 2019 నుంచి మార్చి 2024 వరకు)	
అమ్మ ఒడి	రూ.172.74 కోట్లు
విద్యాదీవెన	రూ.69.58 కోట్లు
వసతి దీవెన	రూ.26.61 కోట్లు
వీదేశీ విద్యాదీవెన	రూ.0.48కోట్లు
జగనన్న విద్యా కానుక	రూ.13.68 కోట్లు
జగనన్న ట్యాబ్‌ల పంపిణీ	రూ.1.91కోట్లు

తణుకు అర్బన్: కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత పేదల విద్యకు ప్రోత్సాహం కరువైంది. నేడు పేద విద్యార్థుల చదువుకు ఆర్థిక ఇబ్బందులు తోడయ్యాయి. గతంలోలేని పరిస్థితి కూటమి ప్రభుత్వం ఏర్పడిన అనంతరం ఈ ఇబ్బందిని ఎదుర్కొంటున్నామని విద్యార్థుల తల్లితండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గత జగన్ హయాంలో పేద కుటుంబాలను విద్యతో ఆర్థికంగా నిలబెట్టాలనే ఉద్దేశ్యంతో పేదల పిల్లలు తప్పనిసరిగా విద్యనభ్యసించేలా ప్రోత్సహించారు. అందులో భాగంగా 1వ తరగతి నుంచి ఇంటర్మీడియేట్ వరకు జగనన్న అమ్మ ఒడి, డిగ్రీ, ఇంజనీరింగ్ విద్యార్థులకు జగనన్న విద్యాదీవెన (పూర్తి ఫీజురీయింబర్స్‌మెంట్), జగనన్న వసతి దీవెనతో పేదల ఇళ్లలో పిల్లలకు ఉన్నత చదువులు చదువుకునే వెసులుబాటు కలిగింది. కానీ నేడు సూపర్ సిక్స్‌లో భాగంగా అమ్మ ఒడికి బదులుగా తల్లికి వందనం అని చెప్పారే కానీ ఇంతవరకు అమలుచేయలేదు. అలాగే విద్యాదీవెన ఇంతవరకు కళాశాలలకు చెల్లింపులు జరగని దుస్థితి. ఇక వసతి దీవెన పథకం విద్యార్థుల తల్లితండ్రులకు చాలా ఆసరాగా ఉండేది. విద్యార్థుల హాస్టల్ ఖర్చులు, ఇతర ఖర్చుల నిమిత్తం ఏడాదిలో విద్యార్థికి రూ. 20 వేలను తల్లిదండ్రుల బ్యాంకు ఖాతాలకు జమచేసేవారు. ఈ పథక లబ్ధిని విద్యార్థులకు బస్సు ఫీజులు, హాస్టల్ ఖర్చులకు తల్లితండ్రులు వినియోగించేవారు. తణుకు నియోజకవర్గంలోని మునిసిపాలిటీ, తణుకు, అత్తిలి, ఇరగవరం మండలాలకు సంబంధించి విద్యార్థుల సౌకర్యార్థం జగనన్న అమ్మ ఒడి, జగనన్న విద్యాదీవెన, జగనన్న వసతి దీవెన పథకాలకు సుమారుగా రూ. 284.92 కోట్లు ఖర్చుచేశారు. కానీ నేటి కూటమి ప్రభుత్వం వచ్చి 4నెలలు దాటినా ఇంతవరకు ఒక్కరూపాయి కూడా విద్యకు కేటాయించని దుస్థితి నెలకొంది.

విద్యకోసం అప్పులు చేయాల్సిన దుస్థితి..

గతంలో పేదల విద్య ఎంతో సౌకర్యవంతంగా నడవగా నేడు పెంచిన పింఛను పంపిణీ తప్ప మరే ఇతర కార్యక్రమాలకు కూటమి ప్రభుత్వం రూపాయి కూడా వెచ్చించని దౌర్భాగ్య స్థితి నెలకొందని, తమ బిడ్డల చదువు సాగాలంటే అప్పులు చేయాల్సిన పరిస్థితి దాపురించిందంటూ తల్లితండ్రులు వాపోతున్నారు. డిగ్రీ, ఇంజనీరింగ్ తదితర కోర్సులు చదివే విద్యార్థుల చదువులు సగంలో ఉండగా గతంలో ఒక్కరూపాయి కూడా ఖర్చు లేకుండా ఏడాది గడిచిపోయేదని కానీ నేడు ఏడాదికి రూ. 25వేలు హాస్టల్ ఖర్చులు, కళాశాల బస్సు ఛార్జీల కోసం అప్పులు చేస్తున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఫీజురీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయకపోవడంతో కళాశాల ఫీజులు కూడా చెల్లించాల్సి వస్తుందని, విద్యార్థులు తమ ధృవపత్రాలు పొందాలంటే బకాయిలు చెల్లించాల్సిన దుస్థితి ఉందని తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

పేదింటి చదువుకు జగనన్న పెద్దపీట



పేదింటి పిల్లలు డాక్టర్లు, ఇంజనీర్లు, పోలీసు అధికారుల ఉద్యోగాలు వచ్చాయంటే అది జగనన్న ఘనతే. పేద కుటుంబాలను విద్యతో ఆర్థికంగా బలోపేతం చేయాలనే ఉద్దేశ్యంతో 1వ తరగతి విద్యార్థి నుంచి ఇంటర్మీడియేట్ వరకు జగనన్న అమ్మ ఒడి, డిగ్రీ, ఇంజనీరింగ్ తదితర కోర్సులకు విద్యాదీవెనతో పూర్తి ఫీజురీయింబర్స్‌మెంట్, హస్టల్ ఖర్చులకు రూ. 20వేలు వసతి దీవెనతో పెద్దపీట వేయడంతో పేద విద్యార్థుల చదువు సాగింది.

– నూకల కనకదుర్గ, తణుకు

పేదల చదువుకు ప్రోత్సాహం లేదా ?



పేదింటి పిల్లల చదువుకు ప్రస్తుత ప్రభుత్వం ప్రోత్సాహం ఇవ్వడంలేదు. ఇప్పటికే ఫీజురీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయకపోవడంతో కళాశాలల్లో విద్యార్థులపై యాజమాన్యాలు ఒత్తిడి తెచ్చి ఫీజులు కట్టించే పరిస్థితి వచ్చింది. వసతి దీవెనతో ఇచ్చే రూ. 20వేలు ఏడాదిలో హాస్టల్ ఖర్చులకు ఎంతో సౌకర్యంగా ఉండేది. కానీ నేడు తల్లి తండ్రులు అప్పులు చేసి ఫీజులు కట్టాల్సి వస్తోంది.

– ఝాన్సీ లారెన్స్, తణుకు

అప్పచేసి ఫీజు కట్టాను



మా అమ్మాయి డాక్టర్ వైఎస్సార్ అర్టీకల్చర్ కళాశాలలో బీఎస్సీ చదువుతోంది. గత 3 సంవత్సరాలు జగన్ పుణ్యమా అని విద్యాదీవెనతో పూర్తి ఫీజురీయింబర్స్‌మెంట్ అందడంతో ఉచితంగా చదివించాను. కానీ నేడు ప్రభుత్వం మారిన వెంటనే ఇటీవలే రూ. 31వేలు ఫీజు చెల్లించాల్సి వచ్చింది. డబ్బులు అందని పరిస్థితిలో మా అమ్మాయి చదువుకోసం అప్పుచేసి ఫీజు కట్టాను.

– బొల్లా దుర్గాప్రసాద్, తణుకు

విద్యుదాఘాత మృతులకు కారుమూరి సంతాపం

తణుకు అర్బన్: విద్యుదాఘాతంతో నలుగురు యువకులు మృతి చెందడం బాధాకరమని మాజీ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. తూర్పుగోదావరి జిల్లా ఉండ్రాజవరం మండలం తాటిపర్రులో సర్దార్ పాపన్నగౌడ్ విగ్రహావిష్కరణ సందర్భంగా సోమవారం ఫ్లెక్సీల ఏర్పాటులో నిమగ్నమైన సమయంలో ఈ దుర్ఘటన ఆ కుటుంబాల్లో తీవ్ర దుఃఖాన్ని మిగిల్చిందన్నారు. తమ ఆరాధ్య దైవమైన పాపన్న గౌడ్ విగ్రహ ఏర్పాటు కోసం తపించిన యువకులు ఊహించని విధంగా దుర్మరణం చెందడం పట్ల తన ప్రగాఢ సంతాపాన్ని తెలియజేస్తున్నానని అన్నారు. మృతుల కుటుంబాలను ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని, తీవ్రంగా గాయపడిన మరొక వ్యక్తికి మెరుగైన వైద్యసేవలు అందించాలని కోరారు. తాటిపర్రులో సోమవారం ఉదయం విద్యుదాఘాతంతో మృతిచెందిన గౌడ యువత ఘటన అత్యంత దారుణమని రాష్ట్ర గౌడ సంఘ స్టీరింగ్ కమిటీ సభ్యులు వీరమల్లు ఫణీంద్రకుమార్ అన్నారు. గౌడల ఆరాధ్యుడు పాపన్న గౌడ్ విగ్రహ ఏర్పాటు పనుల్లో లీనమై ప్రమాదంలో నలుగురు యువకులు మరణించడం బాధాకరమని అన్నారు.

ఆర్థిక సాయం అందజేత

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని గొల్లగూడెం, పుల్లాయగూడెం గ్రామాల్లో పలువురిని ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ సోమవారం పరామర్శించారు. గొల్లగూడెం గ్రామానికి చెందిన కోరశిఖ సత్యనారాయణ బ్రెయిన్ ఆపరేషన్ చేయించుకోవడంతో ఆయనకు రూ.10వేలు, పుల్లాయగూడెం గ్రామానికి చెందిన సంకు రమేష్ ప్రమాదంలో కాలికి గాయం కావడంతో అతనికి రూ.10వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఎమ్మెల్యే వెంట జనసేన మండల అధ్యక్షుడు అడపా ప్రసాద్, జనసేన గ్రామ కమిటి అధ్యక్షుడు వాసు, ఆకుల శ్రీనివాస్, దళిత నాయకుడు చాపల రమేష్, పైబోయిన వెంకట్రామయ్య, అడబాల మురళీ, రాంబాబు, బైనపాలెపు ముఖేష్, టీడీపీ నాయకుడు సుబ్బారాయుడు, నరేష్, కూటమి నాయకులు ఉన్నారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి


వార్డులో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

తాడేపల్లిగూడెం (టీఓసీ): పరిసరాల పరిశుభ్రత సామాజిక బాధ్యత అని, ప్రతి శుక్రవారం డ్రై డే పాటిద్దామని, దోమల ద్వారా వచ్చే వ్యాధులను అరికడదామని మలేరియా సబ్ యూనిట్ హెల్త్ అధికారి వై.వీ.లక్ష్మణరావు పేర్కొన్నారు. హెల్త్ అవగాహన కార్యక్రమాల్లో భాగంగా సోమవారం బేబి సెంటర్ పట్టణ ఆరోగ్య కేంద్రం పరిధిలో 9,10 వార్డులలో జరుగుతున్న వెక్టార్ కంట్రోల్ హైజీన్ కార్యక్రమాలు, క్షేత్రస్థాయి పరిశీలనలు, అవగాహన, ర్యాలీలు జరిగాయి. ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ దోమలు వృద్ధి చెందే ప్రదేశాలను గుర్తించి, వాటిని నిర్వీర్యం చేయడం ద్వారా దోమకాటు ద్వారా వచ్చే మలేరియా, చికెన్ గునియా, మెదడువాపు వంటి వ్యాధులు రాకుండా కాపాడుకోవచ్చునని చెప్పారు. దోమల వృద్ధి చెందకుండా ఉండాలంటే ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో వార్డు ఆరోగ్య కార్యదర్శి మేరీ, వెంకటలక్ష్మి, ఆశా వర్కర్ ప్రశాంతి, సుజాత, అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ప్రచార రథం ప్రారంభోత్సవం


తణుకులో ఆర్టీసీ ప్రచార రథాన్ని ప్రారంభించిన డిపో మేనేజరు గిరిధర్‌కుమార్ తదితరులు

తణుకు అర్బన్ : కార్తీకమాసం సందర్భంగా వివిధ యాత్రలకు సంబంధించిన వివరాలను తెలిపేందుకు కార్తీకమాసం స్పెషల్ ప్రచార రథాన్ని ప్రారంభించినట్లు తణుకు ఆర్టీసీ డిపో మేనేజరు సప్పా గిరిధర్‌కుమార్ తెలిపారు. తణుకు డిపోలో సోమవారం ఆర్టీసీ ప్రచార రథాన్ని ప్రారంభించి మాట్లాడారు. కార్తీకమాసం సందర్భంగా పంచారామాలు, ఏకాదశ రుద్రుల, మన్యసీమ దర్శనాలతోపాటు విశాఖ విహారయాత్ర, శబరిమల యాత్రకు ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. శివభక్తులు, ప్రయాణికులకు బస్సుల సమాచారాన్ని తెలిపేందుకు ప్రత్యేకంగా ప్రచార రథాన్ని తణుకు పట్టణంతోపాటు గ్రామాల్లోకి పంపిస్తున్నట్లు వివరించారు. సోమవారం 50 మంది భక్తులతో ఏకాదశ రుద్రుల దర్శనం కోసం తణుకు డిపో నుంచి బస్సు బయలుదేరినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో డిపో ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణను అడ్డుకోవాలి


మాట్లాడుతున్న చీకటిమిల్లి మంగరాజు

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఎస్సీ వర్గీకరణను ప్రతి మాల అడ్డుకోవాలని, ఈ నెల 26వ తేదీన గుంటూరు జిల్లాలోని నాగార్జున యూనివర్సిటీకు ఎదురుగా ఉన్న బైబిల్ మిషన్ గ్రౌండ్‌లో మాలల మహాగర్జన సభకు లక్షలాదిగా తరలిరావాలని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు చీకటిమిల్లి మంగరాజు కోరారు. పట్టణంలో సోమవారం జరిగిన మాల మహానాడు సమావేశంలో మంగరాజు మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ ప్రయత్నాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విరమించుకోవాలని కోరారు. గర్జనను విజయవంతం చేసేందుకు పల్లె, పల్లెలోను మాలలను సమాయత్తం చేస్తున్నామని తెలిపారు. క్రిమిలేయర్ వల్ల ఎస్సీ కుటుంబంలో ఒకరికి ఉద్యోగం వస్తే, మిగిలిన కుటుంబ సభ్యులకు ఉద్యోగం కోల్పోయి ప్రమాదం ఉందన్నారు. మాలలు ఈ విషయాన్ని గ్రహించాలని తెలిపారు. రానున్న రోజులలో ఎస్సీ, ఎస్టీల రిజర్వేషన్లు తీసే అవకాశాలు ఉన్నాయని, గ్రహించాలని కోరారు. ఈ సమావేశంలో నాయకులు గుంపుల సత్యకృష్ణ, రత్నదీప్, రమేష్ బాబు, తదితరులు పాల్గొన్నారు.

చదువుతోపాటు సాంకేతికతను జోడించాలి


మాట్లాడుతున్న కలెక్టర్ చదలవాడ నాగరాణి

భీమవరం (ప్రకాశంచౌక్): అన్ని రంగాలలో టెక్నాలజీని జోడించి ఉత్తమ ఫలితాలను పొందేందుకు విద్యార్థులు వినూత్నంగా ఆలోచించి, నూతన సాంకేతిక పరికరాలను అందజేయాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి సూచించారు. సోమవారం స్థానిక వశిష్ట సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి జిల్లాలోని వివిధ కళాశాలల విద్యార్థులు, ప్రొఫెసర్లు, జిల్లా అధికారులతో సమావేశమై వివిధ శాఖల్లో సాంకేతికతను జోడించి సులువైన మార్గాల ద్వారా ఉత్తమ ఫలితాలు పొందేందుకు సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ చదువు అంటే మూస పద్ధతిలో పరీక్షలకు మాత్రమే ఉపయోగపడేలా చదవడం కాదన్నారు. డిగ్రీ పట్టాలు పొందిన తర్వాత ఏంటి అనే ప్రశ్న ఉత్పన్నం కాకూడదని, చదువుతోపాటు సాంకేతికతను జోడించి వివిధ రకాలైన ప్రాజెక్టులపై దృష్టి సారించి ప్రయోగ ఫలితాల్లో విజయం సాధించాలన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్‌రెడ్డి, డీఆర్‌వో ఎం.వెంకటేశ్వర్లు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జెడ్.వెంకటేశ్వరరావు, డ్వామా పీడీ డాక్టర్ కేసీహెచ్ అప్పారావు, డీఆర్‌డీఏ పీడీ ఎంఎస్ఎస్ వేణుగోపాల్, ఆర్డబ్ల్యూఎస్ ఎస్ఈ నాగేశ్వరరావు, డీపీవో అరుణశ్రీ, డీసీ హెచ్ఎస్ డాక్టర్ సూర్యనారాయణ, డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ డి.మహేశ్వరరావు, పలు కళాశాలల ప్రొఫెసర్లు పాల్గొన్నారు.

అవినీతిని అరికట్టేందుకు కృషి చేయాలి

భీమవరం: దేశాన్ని అవినీతి నాశనం చేస్తుందని దీనిని అరికట్టకపోతే దేశ ప్రగతికే ప్రమాదమని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా భీమవరం బ్రాంచ్ చీఫ్ మేనేజర్ నిర్మలజ్యోతి అన్నారు. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సహకారంతో సర్ సీవీ రామన్ స్కూల్‌లో యూనియన్ బ్యాంక్, శ్రీ విజ్ఞానవేదిక ఆధ్వర్యంలో అవినీతి నిరోధక అవగాహన వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు.

భక్తజనంతో పోటెత్తిన శైవక్షేత్రాలు


తాడేపల్లిగూడెం(టీఓసీ): స్ఫటిక లింగానికి పూజలు


వాసవి ఆలయంలో ఉమా చంద్రశేఖరస్వామి


తాడేపల్లిగూడెం రూరల్: వీరంపాలెంలో విశ్వేశ్వరస్వామిని విశేషంగా అలంకరించిన దృశ్యం


అత్తిలి: ఉమాసిద్దేశ్వరస్వామికి ప్రత్యేక అభిషేకాలు చేస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని వీరంపాలెం శ్రీబాలాత్రిపుర సుందరీ పీఠంలోని శ్రీవిశ్వేశ్వరస్వామి వారిని దర్శించేందుకు సోమవారం భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఈ సందర్భంగా స్వామివారికి నిత్య పూజలతో పాటు ప్రత్యేక పూజలు, అభిషేకాలను నిర్వహించారు. పీఠం వ్యవస్థాపకులు గరిమెళ్ల వెంకటరమణ శాస్త్రి పర్యవేక్షణలో పూజా కార్యక్రమాలు జరిగాయి. అలాగే, కొండ్రుప్రోలు, కుంచనపల్లి, నవాబుపాలెం, ఆరుగొలను, పెదతాడేపల్లి, చినతాడేపల్లి, జగన్నాథపురం, మాధవరం, నందమూరు, అప్పారావుపేట, ఆరుళ్ల, దండగర్ర, నీలాద్రిపురం, కొమ్ముగూడెం, పట్టింపాలెం, పడాల తదితర గ్రామాల్లోని శివాలయాలు భక్తుల శివనామస్మరణతో మార్మోగాయి.

శివాలయాల్లో కార్తీక మాస పూజలు

తణుకు టౌన్: కార్తీక మాసం సందర్భంగా సోమవారం తణుకు పట్టణంలోని పలు శివాలయాల్లో భక్తులు పూజా కార్యక్రమాలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. సోమవారం వేకువ జాము నుంచి పైడిపర్రులోని శ్రీ భద్రకాళీ సమేత వీరభద్రేశ్వర స్వామివారి ఆలయంలో కార్తిక మాసం పురస్కరించుకుని స్వామివారికి పల్లకీ సేవ, అనంతరం నక్షత్ర హారతి సేవలను భక్తులు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం శివాలయం నుంచి గ్రామంలోని శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయం వరకూ పల్లకీ సేవలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శివ పార్వతుల వేషదారణలతో భక్తులు ఊరేగింపు నిర్వహించారు.

ఉమా చంద్రశేఖరస్వామికి విశేష పూజలు

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలో కార్తీక మాసం సందర్భంగా శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరీ పంచాయతన క్షేత్రంలో ఉమా చంద్రశేఖరస్వామికి సోమవారం విశేష పూజలు జరిగాయి. పంచామృతాలతో, సుగంధ ద్రవ్యాలతో, పండ్ల రసాలతో విశేష అభిషేకాలు నిర్వహించారు. అదే విధంగా శంకరమఠంలోని స్పటిక లింగానికి, శంకరస్వామికి విశేష పూజలు, అర్చనలు నిర్వహించారు. పట్టణంలోని అన్ని శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు.

ఉమాసిద్దేశ్వస్వామి ఆలయంలో...

అత్తిలి: కార్తీక మాసం మొదటి సోమవారం సందర్భంగా మండలంలోని శైవక్షేత్రాలు భక్తజనంతో కిటకిలాడాయి. ఆలయాల్లో హరహర మహాదేవ శంభో శంకరా అంటూ భక్తుల నామస్మరణతో మారుమ్రోగాయి. అత్తిలిలో ప్రసిద్ధిగాంచిన ఉమాసిద్దేశ్వరస్వామి వారి ఆలయానికి వేకువజామున పెద్ద సంఖ్యలో భక్తులు హాజరూఐ స్వామివారికి ఏకాదశ అభిషేకాలు, అమ్మవారికి కుంకుమ పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు ఐలూరి రాజశేఖరశర్మ, సిద్దేశ్వరశర్మ ఆధ్వర్యంలో పూజాదికాలను జరిపారు. ఆలయంలో భక్తులు కార్తీక దీపాలను వెలిగించారు.

నూతన ఆవిష్కరణలతో విద్యార్థుల వికాసం

భీమవరం అర్బన్: జాతీయ స్థాయిలో నూతన ఆవిష్కరణలు అధ్యయనం చేస్తే విద్యార్థుల విజ్ఞాన వికాసం మరింత పెరుగుతుందని భీమవరం ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కేవీ మురళీ కృష్ణంరాజు అన్నారు. భీమవరం మండలంలోని వెంప గ్రామంలో జిల్లా పరిషత్ ఓరియంటల్ ఉన్నత పాఠశాలలో సోమవారం ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాల, మెకానికల్ ఇంజనీరింగ్ విద్యార్థులు ప్రజ్ఞ టెక్నికల్ ఫెయిర్ నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కేవీ మురళీకృష్ణంరాజు మాట్లాడుతూ తమ కళాశాల విద్యార్థులు మధ్యప్రదేశ్‌లోని భోపాల్ పట్టణంలో జరిగిన జాతీయ స్థాయిలో నిర్వహించిన అనువుగా లేని ప్రదేశాల్లోనైనా నడపగలిగిన వాహనాలను డిజైన్ చేసి, రేసింగ్ పోటీల్లో జాతీయ స్థాయిలో ద్వితీయ స్థానంలో నిలిచారన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు నడింపల్లి సూర్యభగవాన్ రాజు, కలిదిండి రామచంద్రరాజు, అప్పలరాజు, వేగేశ్న రమణరాజు, ఎస్‌వీ సోమరాజు, కె.నాగవర్మ, విద్యార్థి కమిటీ చైర్మన్ శ్యాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

చెస్ పోటీల్లో విజేతలకు బహుమతులు


విజేతలకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

భీమవరం: జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అండర్–13 ఓపెన్ అండ్ గరల్స్ చెస్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో గెలుపొందిన విజేతలకు చెస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మాదాసు కిషోర్ సోమ వారం బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా కిషోర్ మాట్లాడుతూ బాయ్స్ విభాగంలో ప్రథమ స్థానంలో అనేపు శశాంక్ (తాడేపల్లిగూడెం), ద్వితీయ స్థానంలో నీలి కుశ్వంత్ (భీమవరం) విజేతలుగా నిలిచారన్నారు. గరల్స్ విభాగంలో ప్రథమ స్థానంలో పెన్మెత్స సహస్ర (భీమవరం) ద్వితీయ స్థానంలో సాధనాల అంజలిప్రియ (భీమవరం) విజేతలుగా నిలిచారన్నారు. విజేతలకు అరసవల్లి ఈశ్వరమ్మ వీర వెంకటాచారి ఛారిటబుల్ ట్రస్ట్ సహకారంతో జ్ఞాపికలు, నగదు బహుమతు లు అందించామన్నారు. విజేతలు ఈ నెల 19 నుంచి మూడు రోజుల పాటు తాడేపల్లిగూడెంలో నిర్వహించే అండర్–13 రాష్ట్ర స్థాయి గరల్స్, ఓపెన్ చెస్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో జిల్లా తరపున ప్రాతినిధ్యం వహిస్తారని కిషోర్ తెలిపారు. అసోసియేషన్ సంయుక్త కార్యదర్శి మైలాపురి మురళి, సురేష్ జైన్, పెదపాటి రవి ప్రసాద్ పాల్గొన్నారు.

రోడ్డు సర్వే చేసి ఆక్రమణలు తొలగించాలి

ఆకివీడు: మందపాడులోని ప్రధాన రహదారి ఆక్రమణలకు గురైందని పంచాయతీ వార్డు సభ్యు డు పెరుమాళ్ల రామకృష్ణ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు మీ కోసంలో పలుసార్లు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. గ్రామంలో 50 లింకుల విస్తీర్ణంలో ఉన్న రహదారి 15 లింకులకు కుంచించుకుపోయిందని, దీనిపై సర్వే చేసి ఆక్రమణల్ని తొలగించాలని అధికారులకు అనేకసార్లు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఆక్రమణలతో పంచాయతీ రోడ్డు మార్జిన్‌లో కచ్చా డ్రెయిన్ కూడా తవ్వలేని దుస్థితిలో ఉందన్నారు. వర్షం వస్తే రోడ్డు మునిగిపోతోందని, నడవడానికి కూడా వీల్లేకుండా ఉందని రామకృష్ణ తెలిపారు. దీనిపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని, తహసీల్దార్ స్పందించి, సచివాలయ సర్వేయర్‌తో కొలతలు వేయాలని విజ్ఞప్తి చేశారు.